### యజమానిని నమ్మించి..

## రూ.18 లక్షలతో ఉడాయించి..

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 28 : యజమానికి నమ్మకంగా ఉన్న ఓ డ్రైవర్ కారులో ఉన్న ₹18 లక్షలతో ఉడాయించాడు. జగిత్యాల టౌన్ సీఐ వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన జైల్ సింగ్ ఫైబ్రోస్ ఎలక్ట్రికల్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్‌గా ఉంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రికల్ సామగ్రిని మార్కెటింగ్ చేస్తుంటాడు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన దయాసింగ్‌ను కారు డ్రైవర్‌గా పనిలో పెట్టుకున్నాడు. క్యాష్ కలెక్షన్ కోసం డ్రైవర్ దయాసింగ్‌తో జైల్‌సింగ్ నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లి అక్కడి నుంచి గురువారం జగిత్యాలకు చేరుకున్నారు. కారును జగిత్యాల పట్టణంలోని పార్క్ వద్ద పార్క్ చేశారు. రెండు జిల్లాల్లో వచ్చిన నగదు ₹18 లక్షలను కారులో పెట్టి డ్రైవర్‌ను కాపలాగా ఉంచి జైల్‌సింగ్ కలెక్షన్ కోసం వెళ్లాడు. తర్వాత తిరిగి కారు వద్దకు రాగా డ్రైవర్‌తో పాటు కారులో ఉన్న ₹18 లక్షలు కనపించలేదు. నగదుతో డ్రైవర్ పారిపోయాడని గ్రహించి శుక్రవారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమకథ విషాదాంతం

- పెద్దలు ఒప్పుకోరని వారం క్రితం ప్రేమికుల ఆత్మహత్యాయత్నం
- ఆ మరుసటి రోజే యువకుడి మృతి
- తాజాగా పరిస్థితి విషమించి యువతి..
- ముస్తాబాద్ మండలం గూడెంలో విషాదం

ముస్తాబాద్ జూన్ 28 : ఆ యువతీ యువకుల ప్రేమకథ విషాదాంతమైంది. తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరనే ఆందోళన వారం క్రితం ఆత్మహత్యకు యత్నించిన జంట, చావుబతుకుల మధ్య పోరాడి ఓడిపోయింది. ఆదివారం ఇద్దరూ పురుగుల మందు తాగగా.. సోమవారం యువకుడు, గురువారం రాత్రి యువతి ప్రాణాలు కోల్పోవడం ఇరుకుటుంబాల్లోనూ విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి నానమ్మ వద్ద ఉంటూ హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిశాడు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కొంతకాలం డ్రైవర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో సదరు వ్యక్తి కూతురు భాగ్యలక్ష్మి (19)తో ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆ యువతి కరీంనగర్‌లో డిగ్రీ చదువుతుండగా, ఆదివారం ఉజ్వల పార్కు సమీపంలో కలుసుకున్నారు. తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరని భావించి పురుగుల మందు తాగారు. ఇద్దరిని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, చందు సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మి పరిస్థితి విషమించి, గురువారం రాత్రి చనిపోయింది. దీంతో ఇరుకుటుంబాలకు తీరని దుఃఖం మిగిలింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు చనిపోవడంతో గ్రామంలోనూ విషాదం నెలకొన్నది.



అధినేత కేసీఆర్‌కు అంబేద్కర్ ఫొటోను అందజేస్తున్న బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, నాయకుడు సురేందర్

## రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దాం

### అధినేత కేసీఆర్ దిశానిర్దేశం

మెట్‌పల్లి, జూన్ 28 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేద్దామని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. నాడైనా నేడైనా నాయకులను తయారు చేసుకున్నది పార్టీనేనని, పార్టీ నాయకులను తయారు చేస్తుందే తప్పా నాయకులు పార్టీని ప్రభావితం చేయలేరని స్పష్టం చేశారు. శుక్రవారం జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల నుంచి వందలాదిగా తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. శ్రేణులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు పలువురు నాయకులు చిత్రపటాలు అందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కోరుట్ల, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు ఉన్నారు.

## ఆగని మిల్లర్ల అక్రమ దందా

### రెండు మిల్లుల్లోనే ₹130 కోట్ల విలువైన ధాన్యం మాయం

- సీఎమ్మార్ పేరిట పలువురు మిల్లర్ల అడ్డదారి
- అమ్ముకున్న ధాన్యం యజమానులు.. టాస్క్‌ఫోర్స్ దాడుల్లో బట్టబయలు
- ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద ఫ్రాడ్‌గా గుర్తింపు
- జమ్మికుంట, ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో కేసులు
- మిల్లర్లలో కలకలం

**ఉమ్మడి జిల్లాలో మిల్లర్ల అక్రమ దందా ఆగడం లేదు. సీఎమ్మార్ పేరిట అక్రమాలకు బ్రేక్ పడడం లేదు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని కొంత మంది తమకు అనుగుణంగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్న తీరు.. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల్లో బట్టబయలైంది. కేవలం రెండు మిల్లుల్లోనే 4.15 లక్షల క్వింటాళ్ల పైచిలుకు ధాన్యం మాయమైనట్టు గుర్తించి, వాటి విలువ ₹130.95 కోట్లకుపైగా ఉన్నట్టు నిర్ధారించారు. అధికారుల ఫిర్యాదు మేరకు జమ్మికుంట మండలం కోరపల్లి శివారులోని మహాశక్తి రైస్‌మిల్, ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలోని సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులపై పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఈ యజమానులే మరిన్ని మిల్లులు నడుపున్నట్టు తెలుస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో అందులోనూ కేవలం ఈ రెండు మిల్లుల్లోనే ఇంత భారీ మొత్తంలో అక్రమాలు వెలుగు చూడడం కలకలం రేపుతున్నది. మరోవైపు ఈ దందాపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ లోతుగా ఆరాతీస్తూ.. పూర్తి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది.**

కరీంనగర్, జూన్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ జమ్మికుంట: హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పలువురు మిల్లర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎంఆర్ ధాన్యం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. దాంతో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం కూడా పలుసార్లు ఆకస్మిక దాడులు చేస్తూ వచ్చింది. కొన్ని కారణాలు, ఒత్తిళ్ల మేరకు అధికారులు కొందరి అక్రమాలను చూసీచూడనట్టు వదిలేయగా.. ఇదే అదునుగా కొంత మంది మిల్లర్లు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. తమ దందాలను నడుపుతున్న తీరుపై మళ్లీ ఫిర్యాదులు వెల్లువెత్తగా.. రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాలతో స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని పలు రైస్ మిల్లులపై ఆకస్మికంగా దాడులు చేసిన విషయం తెలిసిందే. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులోని మహాశక్తి రైస్‌మిల్, ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలోని సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అధికారులు దాడులు చేయగా, సీఎంఆర్ ధాన్యం విషయంలో భారీగా అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. ఆ మేరకు నివేదిక తయారు చేసి రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌కు శుక్రవారం రాత్రే పంపినట్టు తెలిసింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కమిషనర్, సంబంధిత యజమానులపై కేసులు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు.

#### భారీ దందా.. యజమానులపై కేసు

సీఎమ్మార్ ధాన్యం భారీగా గోల్‌మాల్ అయిన విషయాన్ని గుర్తించిన అధికారులు, సదరు యజమానులపై వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. జమ్మికుంట మండలం కోరపల్లి శివారులోని మహాశక్తి రైస్‌మిల్లులో 1,96,620.14 క్వింటాళ్ల వడ్లను మిల్లింగ్ కోసం సీఎమ్మార్ కింద అప్పగిస్తే.. ఆ వడ్లను బియ్యంగా మార్చి సొమ్ముచేసుకొని ప్రభుత్వానికి నష్టం చేకూర్చారని, దీని విలువ ₹62,20,64.821 ఉందంటూ జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సదరు యజమానులు బండారి మారుతి–శారదపై 406, 409, 420 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలోని సీతారామ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఇదే తరహా దందా జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఈ మిల్లులో 2,19,038.23 క్వింటాళ్ల ధాన్యం అప్పగిస్తే సదరు వడ్లను బియ్యంగా మార్చి అమ్ముకున్నారని, వాటి విలువ ₹68,75,22.436గా ఉందని నిర్ధారించారు. తర్వాత ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సదరు ఓనర్లపై కేసు నమోదు చేశారు. అంటే రెండు మిల్లులను కలిపి చూస్తే 4,15,658.37 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన బియ్యం మాయమైనట్టుగా అధికారులు గుర్తించారు. వీటి విలువ ₹130.95 కోట్లకుపైగా ఉందని నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజానికి గతంలోనే అనేక మిల్లుల్లో సీఎమ్మార్ ధాన్యం అమ్ముకున్నట్టు అక్రమాలు వెలుగు చూసినా.. వాటి విలువ ఇంత పెద్ద మొత్తంలో లేదు. కేవలం రెండు మిల్లుల్లో ₹130 కోట్లకుపైగా అక్రమాలు జరగడం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇదే ప్రథమమని మిల్లర్లు చెబుతున్నారు.



గురువారం జమ్మికుంట మండలం కోరపల్లి మిల్లులో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

#### మిల్లర్లలో కలకలం

తాజా వ్యవహారం ప్రస్తుతం ఉమ్మడి జిల్లా మిల్లర్లలో కలకలం సృష్టిస్తున్నది. మరోవైపు రెండు మిల్లుల్లోనే ఇంత పెద్ద మొత్తంలో పట్టుబడడంపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ అధికారుల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నట్లుగా తెలుస్తున్నది. ఈ దందా రెండు మిల్లులకే పరిమితమైందా..? లేక మిగిలిన మిల్లుల్లో ఉందా..? అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే మరిన్ని తనిఖీలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తుండగా, కొంతమంది మిల్లర్లే ఈ అక్రమాల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతోపాటు మరో 12 మిల్లుల్లోనూ ఇదే తరహా దందా జరిగిందని ఫిర్యాదు చేయడమే కాకుండా.. వాటి పేర్లు, పూర్తి వివరాలు కూడా రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్‌కు ఇచ్చినట్టు తెలిసింది. వరుస దాడులు చేసి ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే కాకుండా.. కఠినంగా శిక్షించేందుకు కావాల్సిన అన్ని చర్యలను తీసుకోవాలని నిర్ణయించినట్లుగా తెలుస్తున్నది.

### రాజకీయాలకతీతంగా

## సేవలు అందాలి

- సహకార వ్యవస్థకు పూర్తి స్థాయిలో సహకరిస్తాం
- కేడీసీసీబీ సర్వసభ్య సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై కొండూరి

కరీంనగర్, జూన్ 28 (నమస్తే తెలంగాణ) : రాజకీయాలకు అతీతంగా రైతులకు సహకార సేవలు అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కరీంనగర్‌లోని కేడీసీసీ బ్యాంకు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుతో కలిసి తాను జోడెద్దుల్లా సహకార రంగంలో పనిచేశామని గుర్తు చేశారు. సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కావాలని అనుకున్న తనకు 15 రోజుల్లోనే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఆ తర్వాత కరీంనగర్ ఎంపీగా ఎన్నికయ్యానని, ఇప్పుడు హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలవడం, తమ పార్టీ అధికారంలోకి రావడం తద్వారా మంత్రి పదవి వచ్చిందని చెప్పారు. తాను ఎంత ఎత్తుకు వెళ్లినా సహకార రంగం నుంచి మొదలైన తన రాజకీయ ప్రస్థానాన్ని మాత్రం ఎన్నటికీ మరిచిపోనని స్పష్టం చేశారు. ఒక రైతుగా తన తండ్రి పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు అనేక కష్టాలు పడేవారని గుర్తు చేశారు. ఇప్పుడు సహకార రంగం ద్వారా పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేలా జీవోలను తామే ఇచ్చామన్నారు. సహకార రంగంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలు వేరు, సహకార సేవలు వేరని గుర్తించాలని కోరారు. సహకార రంగం ద్వారా సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కేడీసీసీబీ చైర్మన్ రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ చైర్మన్ పింగలి రమేశ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సీఈఓ సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను చైర్మన్, డైరెక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

### చెల్లి ఒత్తిడితో

## అక్క హత్య

### అన్నదమ్ముల కూతుర్ల మధ్య ప్రేమవైరం

- వరుసకు బావైన యువకుడు మాట్లాడుతున్నడని చెల్లి కోపం
- నీ ప్రేమను నిరూపించుకోవాలంటే అక్కను చంపాలని ఒత్తిడి
- హత్య చేసి బావిలో పడేసిన యువకుడు
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు విచారణ
- తాజాగా జగిత్యాల జిల్లా కోర్టు తీర్పు
- యువకుడికి జీవిత ఖైదు

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 28: చెల్లి ప్రేరణతో అక్కను హత్య చేసిన ప్రియుడికి జీవిత ఖైదు విధిస్తూ జగిత్యాల జిల్లా కోర్టు జడ్జి నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. సీఎంఎస్ ఎస్ఐ రాజూనాయక్ వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం ఆత్మకూరుకు చెందిన డుంగబోయిన రాణి, దీప్తిప్రియ అన్నదమ్ముల కూతుర్లు. వరుసకు బావ అయిన పాలెపు తిరుమల్ దీప్తిప్రియతో చనువుగా ఉండేవాడు. కొంతకాలం తర్వాత రాణితో కూడా చనువును పెంచుకున్నాడు. విషయం తెలిసిన దీప్తిప్రియ తిరుమల్‌తో మాట్లాడడం బంద్ చేసింది. ఎందుకు మాట్లాడడం లేదని తిరుమల్ అడగ్గా రాణితో ఎందుకు చనువుగా ఉంటున్నావని నిలదీసింది. దీంతో తిరుమల్ అదంతా అబద్ధమని బుకాయించాడు. అయితే నిజం కాకపోతే నీ ప్రేమను నిరూపించుకోవాలంటే అక్క రాణిని హతామార్చాలని ఒత్తిడి తెచ్చింది. నిత్యం తిరుమల్‌కు మెస్సేజ్‌లు పెట్టేది. ఈ క్రమంలో తిరుమల్ 2016 డిసెంబర్ 7న మాట్లాడుదామని రాణిని బయటకు తీసుకెళ్లి మెడకు వైరు బిగించి హత్య చేశాడు. మృతదేహాన్ని ఓ పాడుబడ్డ బావిలో పడేశాడు. చీకటిపడ్డా రాణి ఇంటికి రాకపోండంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. తిరుమల్‌పై అనుమానంతో మెట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు పాడుబడ్డ బావిలో రాణి మృతదేహాన్ని గుర్తించి హత్య కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. పక్కా సాక్ష్యాధారాలు సేకరించి తిరుమల్, దీప్తిప్రియను అరెస్ట్ చేసి కోర్టుకు సరెండర్ చేశారు. సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించగా, పీపీ మల్లికార్జున్ నేరాన్ని రుజువు చేశాడు. రాణిని హత్య చేసిన తిరుమల్‌కు యావజ్జీవ శిక్షతోపాటు ₹5వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ తీర్పును వెలువరించారు. కేసును ఛేదించి నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులు, సీఎంఎస్ టీంను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.



కరీంనగర్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులు

## ‘ప్రైవేట్’ దోపిడీని అరికట్టాలి

### ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏబీవీపీ నిరసన

కమాన్‌చౌరస్తా, జూన్ 28: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, సర్కారు విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్లతో శుక్రవారం ఉమ్మడిజిల్లావ్యాప్తంగా ఏబీవీపీ నిరసనలకు దిగింది. జిల్లాల్లోని విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించింది. విద్యార్థి నాయకులు ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో హోరెత్తించారు. కరీంనగర్‌లో చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పోలీసులు విద్యార్థి నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి ఠాణాలకు తరలించారు. అడ్డగోలు ఫీజుల దోపిడీకి పాల్పడతున్న కార్పొరేట్ సంస్థలను కట్టడి చేయలేని డీఈవోను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

## రెస్టారెంట్‌పై కొరడా

- ఎన్టీపీసీలోని తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తనిఖీలు
- ₹20 వేల జరిమానా

జ్యోతినగర్, జూన్ 28: ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో శుక్రవారం రామగుండం నగరపాలక సంస్థ అధికారులు తనిఖీలు చేశారు. ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ₹20 వేల జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా.. ఫ్రిజ్‌లో నాణ్యతలేని నిల్వ ఉంచిన చికెన్, ఇతర ఆహార పదార్థాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్ కిరణ్, వైకుంఠం, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మధూకర్, తదితరులు పాల్గొన్నారు.





ఆర్డీవో వినియోగిస్తున్న వాహనం హనుమానాయక్ పేరిట రిజిస్ట్రేషన్ అయినట్టు ఆర్డీవో వెబ్‌సైట్లో ధ్రువీకరణ

## అద్దెకారు పేరిట అవినీతి పర్వం?


- సొంత కారును అద్దె వాహనంగా చూపి అక్రమార్జన?
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వడ్డీ డబ్బులూ దుర్వినియోగం?
- మంథని ఆర్డీవోపై ఆరోపణలు
- మండిపడుతున్న నిర్వాసితులు

**భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మంథని ఆర్డీవోను ఆర్‌అండ్‌ఆర్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆయనకు సింగరేణి సంస్థ ప్రత్యేక వాహనం కేటాయించింది. మెయింటనెన్స్, ఫ్యూయల్ ఖర్చులను సైతం భరిస్తుంటుంది. అయితే, ఇదే అదునుగా అవినీతికి తెరలేచినట్టు తెలుస్తున్నది. సదరు అధికారి సొంత కారునే అద్దె వాహనంగా చూపడమే కాదు, నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్, ఇతర ఖర్చుల పేరిట బిల్లులు కాజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బినామీ పేరిట బిల్లులు డ్రా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**


పెద్దపల్లి, జూన్ 28(నమస్తే తెలంగాణ)/మంథని: ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేకాధికారి అయిన మంథని ఆర్డీవో హనుమానాయక్‌కు సింగరేణి సంస్థ గతేడాది మార్చిలో ఏడాదికి ₹4,80,000 అద్దెతో ప్రత్యేక వాహనాన్ని కేటాయించింది. అయితే, ఆ వాహనం కొద్ది రోజులే కనిపించింది. తర్వాత ఏమైందో ఏమోగానీ మంథని ఆర్డీవో ఆ వాహనాన్ని తప్పించి, తన సొంత పేరుపై రిజిస్ట్రేషన్ అయిన నెక్సా ఎక్స్‌ఎల్ 6 మోడల్ కారు (టీఎస్ 07 హెచ్ఎన్ 6692)నే అద్దె వాహనంగా వాడుతున్నాడు. ఈ వాహనం హనుమానాయక్ వాదిత్య పేరుపై 11-14-2062/సీ7/301, విజయదుర్గ నిలయం, చిత్రలేవుట్ ఎల్బీనగర్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా పేరుతో రిజిస్టరై ఉన్నది. ఇదే వాహనాన్ని సింగరేణి అద్దె వాహనంగా వినియోగిస్తూ.. బిల్లులను కాజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని కొన్ని చెల్లింపుల్లో తన బినామీగా ప్రచారం జరుగుతున్న కే అవినాశ్ పేరిట బిల్లులను డ్రా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

#### సొంత వాహనానికే బిల్లుల చెల్లింపులు!

ఆర్డీవో తన పేరుపై రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న వాహనానికి పెట్రోల్, ఇతర ఖర్చులను సింగరేణి, ప్రభుత్వం నుంచి బిల్లులను చెల్లిస్తున్నట్టు తెలుస్తున్నది. వాస్తవంగా సింగరేణి సంస్థ కానీ, ప్రభుత్వం కానీ, ట్యాక్స్ ప్లేట్ ఉన్న వాహనాలను మాత్రమే లీజ్‌కు తీసుకుంటుంది. లీజ్ ఏడాదికి ₹4,80,000 చెల్లిస్తున్న క్రమంలో వాహనానికి సంబంధించి మరే ఖర్చులు, పెట్రోల్ సహా ఓనరే చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సదరు అధికారి ఆ నిబంధనలను తుంగలోకి తొక్కినట్టు తెలుస్తున్నది. 2023 అక్టోబర్ 17న ఓం టైర్స్ అండ్ ఆయిల్ స్టోర్స్ పెద్దపల్లిలోని షాపులో కారు (టీఎస్ 07 హెచ్ఎన్ 6692) టైర్లు కొనుగోలు చేసినట్టు ₹30 వేల బిల్లులను డ్రా చేసినట్టు తెలిసింది. అలాగే, గత మేలో మంథని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ఖాతా నుంచి ₹86,078 పెట్రోల్ బిల్లు చెల్లింపులకు మంథనిలోని శ్రీ రామకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ పేరిట చెక్కును సిద్ధం చేసినప్పటికీ, దానిని క్యాన్సల్ చేసి అవినాశ్ పేరిట మే 18న చెక్కును డ్రా చేసినట్టు బయటపడింది. తాజాగా శ్రీ రామకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ పేరిట ₹35,777 బిల్లు లేపినట్టు తెలిసింది.



శ్రీ రామకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ పేరిట సిద్ధం చేసి క్యాన్సల్ చేసిన చెక్కు



మంథని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ఖాతా నుంచి అవినాశ్ పేరిట చేసిన చెల్లింపుల చెక్కు

#### ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వడ్డీ డబ్బులూ దుర్వినియోగం?

మంథని ఆర్డీవో భూ సేకరణ ప్రత్యేకాధికారి కూడా కావడంతో మంథని డివిజన్ పరిధిలోని సింగరేణి, కాళేశ్వరం ప్రాజెక్టు, నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించిన ప్యాకేజీ డబ్బులు ఆర్‌అండ్‌ఆర్ అధికారి ఖాతాలోనే పెద్ద మొత్తంలో నిల్వ ఉన్నాయి. అయితే, ఈ డబ్బులపై వడ్డీ కూడా ప్రతి నెలా అత్యధికంగానే జమ అవుతూ వస్తున్నది. ఈ డబ్బుల నుంచి ఎలాంటి ఖర్చులు, చెల్లింపులు చేయాలన్నా కలెక్టర్ అనుమతి తప్పనిసరి. కానీ, ఆ నిబంధనలు పాటించకుండానే వడ్డీ డబ్బులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

#### బినామీతోనే అన్నీ

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్లోబల్ కాంట్రాక్టర్స్(ఏజెన్సీ) ద్వారా అన్ని కలెక్టరేట్, రిటర్నింగ్ అధికారుల (ఆర్డీవో) కార్యాలయాలకు జూనియర్ అసిస్టెంట్లుగా తాత్కాలిక సిబ్బందిని నియమించారు. అదే సమయంలో మంథని ఆర్డీవో ఆఫీస్‌లో జాయిన్ అయిన కే అవినాశ్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ధరణితోపాటు ఇతర కార్యకలాపాల్లో అత్యధికంగా ప్రాధాన్యం ఇస్తున్నారని మీడియాలో కథనాలు రావడంతో అతన్ని విధుల నుంచి పక్కన పెట్టి, ఆర్డీవో ఆఫీస్‌కు రానివ్వడం లేదని తెలిసింది. కానీ, అదే వ్యక్తి ఆర్డీవో నివాసముండే రామగిరి గెస్ట్‌హౌస్‌లో ఆఫీస్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నడిపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

#### వాహనం సింగరేణి సంస్థ కేటాయించినదే

నేను అధికారిక కార్యక్రమాల కోసం వినియోగిస్తున్న వాహనం సింగరేణి సంస్థ కేటాయించినదే. నా వాహనం అని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. ఫ్యూయల్ చెల్లింపుల్లో సైతం ఎలాంటి అక్రమాలు జరగలేదు. అదంతా తప్పు.

**- హనుమానాయక్, ఆర్డీవో (మంథని)**


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571